నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్ - నిర్మల్
5 | నిజామాబాద్, బుధవారం 19 ఫిబ్రవరి 2025 | ADILABAD NIRMAL

పొలాలను సందర్శించిన మాజీ మంత్రి

పంటను పరిశీలిస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

జైనథ్, ఫిబ్రవరి 18 : మాజీ మంత్రి జోగు రామన్న రైతు సంఘాల నాయకులతో కలిసి మంగళవారం పొలాలను సందర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో దిగుబడులపై ప్రభావం పడుతున్నది. నష్టాలపై రైతులను జాగృతం చేసేందుకు కలియతిరిగారు. దీపాయి గూడలోని తన సొంత పొలంలో పంటల ను పండిస్తూ ప్రయోగాత్మకంగా కలిగే నష్టాల ను ఎలా నివారించాలనే కోణంలో రైతులకు అవగాహన కలిగించేలా దృష్టి సారించారు. పెరుగుదల, మార్పిడి, సహజత్వాన్ని ప్రతి ఒక్కరికి తెలియజేయాలనే ఉద్దేశంతో పొలాల సందర్శన చేసినట్లు రామన్న తెలిపారు. ఆయన వెంట గోవర్ధన్ యాదవ్, లక్ష్మణ్, బట్టు సతీశ్, నల్ల మహేందర్, కాసర్ల అశోక్, పట్టెపు విలాస్, రామన్న, నల్ల రామన్న, విఠల్ గేడం, పట్టేపు అశోక్, సిహెచ్ ఇస్తరి, దేవర్తి అశోక్, అగ్గ దేవన్న, తదితరులు పాల్గొన్నారు.

నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

కార్మిక వ్యతిరేక బడ్జెట్‌ను నిరసిస్తూ ఆందోళన

నిర్మల్ చైన్‌గేట్, ఫిబ్రవరి 18 : రైతులు, కార్మికులు, దేశ ప్రయోజనాలను పక్కనబెట్టి కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు అనుకూల బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందని నిరసన వ్యక్తం చేశారు. వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో మంగళవారం నిర్మల్ ఆర్డీవో కార్యాలయం ఎదుట బైఠాయించారు. ఈ సందర్భంగా నాయకులు కె. రాజన్న, రెడ్డి మాట్లాడుతూ.. దేశంలో నిరుద్యోగం పెరిగిందన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర రావడం లేదన్నారు. రైతాంగం తమ పంటలకు గిట్టుబాటు ధర చట్టం తీసుకురావాలని, రుణాలు మాఫీ చేయాలని కోరుతుంటే బడ్జెట్‌లో ఒక్క రూపాయి కేటాయించకపోవడం దారుణమని విమర్శించారు. ఈ కార్యక్రమంలో వామపక్ష పార్టీల నాయకులు ఉపాలి, ఎస్.గంగన్న, వెంకటేశ్, మహమూద్, అనంతరావు, దుర్గే పుండలిక్ పాల్గొన్నారు.

ఆదిలాబాద్ పంజాబ్ చౌక్‌లోని ఎస్‌బీఐ బ్యాంకులో ఆందోళన చేస్తున్న రైతులు

బాబోయ్ బ్యాంకర్లు

వివాదాస్పదంగా మారుతున్న బ్యాంకోళ్ల వ్యవహారశైలి

- ఆదిలాబాద్ పట్టణంలోని ఎస్‌బీఐలో రైతుల ఆందోళన
- ఇటీవల ఐసీఐసీఐ బ్యాంకులో రైతు ఆత్మహత్య

> *ఆదిలాబాద్ జిల్లాలో బ్యాంకర్ల వ్యవహారశైలి వివాదాస్పదంగా మారుతున్నది. అండగా నిలవాల్సిన బ్యాంకర్లు తమను వేధింపులకు గురి చేస్తున్నారంటూ రైతులు ఆందోళనకు గురవుతున్నారు. రైతులకు సంబంధించిన ఖాతాలు ప్రభుత్వ బ్యాంకుల్లో అధికంగా ఉంటాయి. రైతులు వారి ఆర్థిక లావాదేవీల నిర్వహణ కోసం బ్యాంకుల్లో ఖాతాలు తెరుస్తారు. సేవింగ్ ఖాతాలతోపాటు రుణాల ఖాతాలు ఉంటాయి. ప్రభుత్వం రైతు భరోసా, రైతు బీమా, రుణమాఫీతోపాటు పంటల విక్రయాలు, క్రాప్ ఇన్సూరెన్స్ సంబంధించిన పంటల విక్రయాల డబ్బులను బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తుంది. దీంతో ప్రతి రైతుకు బ్యాంకు అకౌంట్ తప్పనిసరిగా మారింది. ఒకే కుటుంబంలో ఎంత మంది పేరిట పట్టా పాసు పుస్తకాలు ఉంటే వారి బ్యాంకు ఖాతాలు ఉండాలి.*

ఆదిలాబాద్, ఫిబ్రవరి 18(నమస్తే తెలంగాణ) : రైతులకు అండగా నిలవాల్సిన బ్యాంకర్లు రైతులను వేధింపులకు గురి చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇటీవల అధికారులు, సిబ్బంది వేధింపులు భరించలేక ఆదిలాబాద్ పట్టణంలోని ఐసీఐసీఐ బ్యాంకులో రైతు దేవురావు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. సిరికొండ మండలంలోని ఓ బ్యాంకు అధికారి మహిళకు మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కు డబ్బులను రుణం కింద జమచేసుకున్నాడు. తాజాగా మంగళవారం పట్టణంలోని పంజాబ్‌చౌక్ ఎస్‌బీఐ బ్రాంచిలో తమ పంట డబ్బులు ఇవ్వాలంటూ రైతులు ఆందోళన చేపట్టారు. ఆదిలాబాద్ రూరల్ మండలంలోని యాపల్‌గూడకు చెందిన నక్కల జగదీశ్, అంకోలికి చెందిన నల్లా వికాస్, భీంపూర్ మండలంలోని వడూర్‌కు చెందన జిల్లెల్ల మోహన్ గతేడాది సీసీఐకి పత్తి విక్రయించారు. పంటను అమ్మిన డబ్బులు నక్కల జగదీశ్‌కు రూ. 2 లక్షలు, నల్ల వికాస్‌కు రూ.76 వేలు, జిల్లెల్ల మోహన్‌కు రూ.ఒక లక్ష రావాలి. ఆదిలాబాద్ ప్రధాన పోస్టాఫీసులోని వీరి ఖాతాల్లో పైసలు జమ అయ్యాయి. పోస్టల్ సిబ్బంది డబ్బులను తమ ఖాతాల్లో వేసుకున్నారు. ఈ మేరకు సైబర్ క్రైమ్ నమోదైంది. అనంతరం బ్యాంకు సిబ్బంది రైతుల డబ్బులను బ్యాంకుల్లోని వారి ఖాతాల్లో జమ చేశారు. కేసులో భాగంగా రైతుల ఖాతాలను హోల్డ్‌లో పెట్టారు. విచారణ జరిపిన పోలీసులు రైతుల బ్యాంకు ఖాతాలను హోల్డ్ నుంచి విడుదల చేయాలని బ్యాంకర్లకు నోటీసులు ఇచ్చినా స్పందన లేకపోవడంతో రైతులు ఆందోళన చేశారు. బ్యాంకు అధికారులు తమకు చేయూతనిచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

వంద సార్లు బ్యాంకుకు వచ్చా..

నేను పత్తి అమ్మిన డబ్బులు రూ.2 లక్షలు నా బ్యాంకు ఖాతాలో జమ అయ్యాయి. ఏడాది కాలంగా డబ్బుల కోసం బ్యాంకు చుట్టూ తిరుగుతున్నా అధికారులు స్పందించడం లేదు. పైసలు రావడానికి అవసరమైన పత్రాలను బ్యాంకు అధికారులకు సూచించినా వారు పట్టించుకోవడం లేదు. ఈ రోజు బ్యాంకులో ఆందోళన చేస్తేగాని అధికారులు స్పందించ లేదు. ఉన్నతాధికారులతో మాట్లాడి ఒకరి ఖాతాను హోల్డ్‌లో నుంచి తీయించారు. నా బ్యాంక్ అకౌంట్ సమస్య సాయంత్రం వరకు పరిష్కారం అవుతుందన్నారు.

- నక్కల జగదీశ్, రైతు, అంకోలి, ఆదిలాబాద్ రూరల్ మండలం

అగ్గువకే బంగారమంటూ బురిడీ

జేసీబీతో తవ్వుతుంటే దొరికింది.. తక్కువకే ఇస్తామంటూ కుచ్చుటోపి

- కౌజుపిట్టల విక్రయాల పేరిట పరిచయం పెంచుకొని మోసం
- నమ్మబలికి నకిలీ గోల్డ్ అంటగడుతున్న కేటుగాళ్లు
- ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలకు తీసుకెళ్లి డబ్బులు గుంజుకుంటున్న ముఠా
- బెల్లంపల్లి, నెన్నెల మండలాల్లో పలువురు బాధితులు
- ఎవరికి చెప్పకోవాలో తెలియక సతమతమవుతున్న వైనం

> *బెల్లంపల్లి పట్టణానికి చెందిన ఓ లారీ యాజమానికి సైతం ఓ వ్యక్తి ఆరు నెలల క్రితం ఇలాగే పిట్టలు విక్రయించాడు. నంబర్ తీసుకొని నెల రోజులకు వాట్సాప్‌లో బంగారం దొరికిందంటూ ఫొటోలు, వీడియోలు పంపించాడు. దానికి సదరు లారీ యాజమాని ఇలాంటివి నాకు అవసరం లేదు. మరోసారి ఫోన్ చేయకు అని చెప్పి పెట్టేశాడు. అయినా తరచూ వెంట పడుతుండటంతో ఓ స్నేహితుడిని తీసుకొని ఆంధ్రప్రదేశ్‌లోని హిందూపూర్‌కు వెళ్లాడు. అక్కడి నుంచి బంగారం బిల్లలను తెచ్చి బెల్లంపల్లిలో తెలిసిన నగల దుకాణంలో టెస్ట్ చేపించాడు. ఒరిజినల్ అని చెప్పడంతో తన స్నేహితులతో కలిసి రూ.40 లక్షల వరకు పట్టుకొని ఆంధ్రప్రదేశ్‌లోని హిందూపూర్‌కు వెళ్లాడు. అక్కడ డబ్బులు ఇచ్చి బంగారం తెచ్చుకున్నారు. తీరా బెల్లంపల్లికి వచ్చాక వాటిని టెస్ట్ చేపిస్తే అది నకిలీ బంగారం అని తేలింది. ఈ విషయం పోలీసులకు చెబితే ఎంక్వైరీలు, కేసులు అని భయపడి విషయం బయటికి చెప్పలేదు.*

మంచిర్యాల ప్రతినిధి(నమస్తే తెలంగాణ)/నెన్నెల, ఫిబ్రవరి 18 :

.. ఇలా వీరిద్దరే కాదు.. గ్రామీణ ప్రాంతాల్లోని వ్యాపారులు, సాధారణ జనాల అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని, దొరికిన బంగారం తక్కువ ధరకే ఇస్తామంటూ ఓ ముఠా మోసాలకు పాల్పడుతున్నది. బెల్లంపల్లి ప్రాంతం నుంచి ఐదారు బ్యాచ్‌లు, నెన్నెల మండలం నుంచి తొమ్మిది బ్యాచ్‌లు.. ఒక్కో బ్యాచ్‌లో ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది ఈ కేటుగాళ్ల చేతుల్లో పడి మోసపోయినట్లు తెలుస్తున్నది. బెల్లంపల్లిలో ప్రముఖ వ్యాపారులు, నెన్నెల మండల కేంద్రానికి చెందిన పేరున్న వ్యక్తులు సైతం బాధితుల్లో ఉండటం గమనార్హం. ఇలా మంచిర్యాల జిల్లాల్లో ఇప్పటి వరకు ఈ కేటుగాళ్ల చేతుల్లో పడి మోసపోయిన వారు ఎందరో ఉన్నారు. విషయం బయటికి

తెలిస్తే పరువు పోతుందని కొందరు.. పోలీసులకు చెబితే కేసులు, ఎంక్వైరీలు.. ఇవన్నీ అవసరమా.. అని మరికొందరు ఏం చేయాలో తెలియక సతమతమైపోతున్నారు.

ఇలా మోసం చేస్తారు...

ముందు మారువేషంలో గ్రామాల్లోకి వచ్చే కేటుగాళ్లు కౌజు పిట్టలు, అడవి కుందేళ్లు, పూరేడు పిట్టలను వేటాడి అమ్ముకునేవారిగా నటిస్తారు. తమ దగ్గర పిట్టలు కొనుగోలు చేసిన వారి నుంచి అవసరముంటే ఫోన్ చేయండంటూ నంబర్ తీసుకుంటారు. ఒక్కసారి మన నంబర్ వారి చేతికి పోయిందా ఒకటికి రెండుసార్లు ఫోన్‌లు చేసి పిట్టలు ఉన్నాయి.. తీసుకురమ్మంటారా.. అంటూ పరిచయం పెంచుకుంటారు. ఇలా పలుసార్లు ఫోన్ మాట్లాడాక.. ఏదో ఓ రోజు ఫోన్ చేసి 'సార్ మా తమ్ముడు జేసీబీ నడుపుతుంటే బంగారం దొరికింది. మీకు కావాలంటే చెప్పండి.. అగ్గువ ధరకే ఇప్పిస్తా.. మాకు ఎక్కడ అమ్మాలో తెలియడం లేదు. అందుకని మీకు చెబుతున్నాం.. అంటూ నమ్మబలుకుతారు. నమ్మకం లేకుంటే మా దగ్గర ఉన్న బంగారం నుంచి కొద్దిగా తీసుకెళ్లి చెక్ చేసుకోండంటూ వీడియో కాల్ చేసి తమదగ్గరున్న బంగారు ముద్దలు, చిన్నిచిన్న బంగారు బిల్లలను చూపిస్తారు. ఇలా రాయ్‌చూర్, మైసూర్, ఏపీలోని పరిగి, హిందూపూర్, కదిరి ప్రాంతాలు ఒక్కొక్కరికీకీ ఒక్కో ఊరు పేరు చెబుతారు. వీడియో కాల్‌లో బంగారాన్ని చూసి ఆశపడి.. వారు రమ్మన్న చోటుకు వెళ్తే ముందు ఒరిజినల్ బంగారు ముద్దలు, బిల్లలను చూపిస్తారు. అలా చూసిన దాని నుంచి ఏదైనా చిన్న బిల్ల ఒకటి తీసుకెళ్లి చెక్ చేసుకొని రమ్మంటారు. వాటిని చెక్ చేస్తే ఒరిజినల్ అని తేలాక.. డబ్బులు పట్టుకొని బంగారం కోసం వెళ్తే నకిలీ బంగారాన్ని అంటగడుతారు. లేదా మెడ మీద కత్తిపెట్టి తీసుకెళ్లిన డబ్బులను లాక్కుంటారు. ఈ విషయం ఎవరికైనా చెబితే చంపేస్తామంటూ బెదిరిస్తారు. ఓ వ్యక్తి వారు చెప్పిన ప్రాంతానికి వెళ్లి వచ్చి.. తిరిగి వెళ్లే వరకు కేటుగాళ్ల మనషులు ఏదో ఒకరకంగా ఫాలో అవుతూనే ఉంటారు. ఏ మాత్రం తేడా వచ్చినా ప్రాణాలు పోతాయంటూ బాధితులు చెబుతున్నారు. ఇప్పటికీ బెల్లంపల్లి, నెన్నెల మండలాల్లో పలువురి దగ్గర కేటుగాళ్ల నుంచి టెస్టింగ్ కోసం తెచ్చుకున్న బంగారు గుండ్లు ఉన్నట్లు తెలుస్తున్నది.

> *నన్నెల మండల కేంద్రానికి చెందిన ఓ చిన్న హోటల్ నిర్వాహకుడు రవీందర్ (పేరు మార్చాం) దగ్గరికి రెండేళ్ల క్రితం ఓ వ్యక్తి వచ్చి కౌజు పిట్టలు విక్రయించాడు. మీకు మళ్లీ పిట్టలు కావాలంటే ఫోన్ చేయండని నంబర్ ఇచ్చి వెళ్లాడు. ఓసారి రవీందర్ పిట్టలు కావాలని సదరు వ్యక్తికి ఫోన్ చేస్తే తెచ్చి ఇచ్చాడు. ఇలా నాలుగైదు సార్లు మాట్లాడాక.. ఓ రోజు ఫోన్ చేసి 'మా తమ్ముడు బెంగళూరులో జేసీబీ నడుపుతాడు. రోడ్డు పనులు చేస్తుంటే బంగారం దొరికింది. అది ఎక్కడ అమ్మాలో తెలియడం లేదు. మీకు కావాలంటే తీసుకోండి. అగ్గువ ధరకే ఇస్తాం' అని చెప్పాడు. 'మీకు అనుమానముంటే వచ్చి బంగారం తీసుకెళ్లి చెక్ చేసుకోండి' అని చెప్పాడు. ఇలా రవీందర్‌ను ఓ రోజు ఆంధ్రప్రదేశ్‌లోని కదిరికి తీసుకెళ్లాడు. అక్కడ బంగారు నాణేల దండలు చూపించాడు. అందులో నుంచి ఓ చిన్న బిల్ల తీసుకొని పరీక్షించుకోమని చెప్పాడు. ఇంటికి వచ్చి చెక్ చేసుకున్న రవీందర్.. అది ఒరిజినల్ బంగారం అని తెలుసుకున్నాడు. రూ.10 లక్షలు పట్టుకొని బంగారం తీసుకునేందుకు తిరిగి కదిరి వెళ్లాడు. అక్కడికి వెళ్లాక రవీందర్‌ను కత్తులతో బెదిరించి డబ్బులు లాగేసుకొని, ఎవరికైనా చెబితే చంపేస్తామంటూ బెదిరించి పంపించేశారు. ఇక ఈ విషయం బయటికి తెలిస్తే తన పరువు పోతుందని భావించిన రవీందర్ మిన్నకుండిపోయాడు.*

నమ్మి మోసపోవద్దు.. ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం

ఈ తరహా మోసాలపై ఇప్పటి వరకు మాకు ఎలాంటి ఫిర్యాదులు రాలేదు. కర్ణాటక ప్రాంతానికి చెందిన ముఠాలు ఇలాంటి మోసాలు చేస్తుంటాయి. మోసపోయిన వారు ఎవరైనా సరే ధైర్యంగా వచ్చి ఫిర్యాదు ఇవ్వండి. మీ వివరాలు గోప్యంగా ఉంచుతాం. ఎంక్వైరీలు, కేసులు చేయాల్సి వస్తుందని భయపడొద్దు. ఇలా తెలియని వ్యక్తులను నమ్మి మోసపోవద్దు. అపరిచితులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

- రవికుమార్, బెల్లంపల్లి ఏసీపీ

బావను హత్య చేసిన బామ్మర్ది

రుయ్యాడి గ్రామంలో ఘటన

కొక్కూరి మహేందర్(ఫైల్)

తలమడుగు, ఫిబ్రవరి 18 : సొంత బావను కత్తితో పొడిచి బామ్మర్ది హత్య చేసిన ఘటన మండలంలోని రుయ్యాడి గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఆదిలాబాద్ రూరల్ మండలంలోని తంతోలి గ్రామానికి చెందిన కొక్కూరి మహేందర్(42) తన భార్య నవితతో కలిసి జీవనోపాధి కోసం 13 ఏళ్ల క్రితం తన అత్తగారి గ్రామమైన రుయ్యాడి గ్రామంలో అద్దె ఇంట్లో ఉంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. భార్య నవితకు కొన్ని రోజుల నుంచి భర్త మహేందర్ వేరే మహిళలతో అక్రమ సంబంధాలు పెట్టుకున్నాడని అనుమానంతో ఇంట్లో గొడవ జరగడంతో నవిత అదే గ్రామంలో తన తమ్ముడై కుర్మ అశోక్ ఇంటికి వెళ్లిపోయింది. మంగళవారం ఉదయం అశోక్ తన బావ మహేందర్‌కు ఫోన్ చేసి పిల్లలు గుర్తు చేస్తున్నారు. అక్కను తీసుకెళ్లవా? అని ఫోన్ చేశాడు. పక్క కాలనీలో ఉంటున్న తన బావను చంపాలన్న ఉద్దేశంతో మహేందర్‌కు వెళ్లి పిల్లలు ఉన్నారని ఈ సమయంలో అక్రమ సంబంధాలు ఎందుకని ఇద్దరు గొడవ పడ్డారు. చంపాలన్న ఉద్దేశంతో కత్తితో ఛాతిపై ఎడమ వైపు పోడవడంతో మహేందర్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటన స్థలాన్ని సీఐ ఫణిందర్, ఇన్‌చార్జి ఎస్సై రాధిక అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అశోక్ పరారీలో ఉన్నాడు. మహేందర్‌కు కొడుకు, కూతురు ఉన్నారు. మహేందర్ తమ్ముడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

భార్యపై భర్త హత్యాయత్నం

ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 18 : అనుమానమే పెనుభూతమైంది. భార్యతోపాటు అత్త, బంధువులపై కత్తులతో దాడి చేసిన ఘటన మంగళవారం చోటు చేసుకున్నది. పోలీసుల కథనం ప్రకారం.. ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండల కేంద్రానికి చెందిన సంజీవనికి ధనోరా(బీ) గ్రామానికి చెందిన గుట్టే అంకుశ్‌తో వివాహమైంది. వారికి ఇద్దరు పిల్లలు. భర్త అంకుశ్ కొంతకాలంగా భార్యపై అనుమానంతో తరచూ గొడవ చేస్తున్నాడు. వారం రోజుల క్రితం భార్యాభర్తల మధ్య గొడవ జరగడంతో భార్య సంజీవని తన తల్లిగారి ఇంటికి వచ్చి ఉంటుంది. అయితే మంగళవారం మధ్యాహ్నం గుట్టే సంజీవని ప్రియుడు రాహుల్ గుట్టే భర్త అంకుశ్‌కు ఫోన్ చేసి నీ భార్యతో ఉన్న ఏం చేస్తావో చేయ్ అని చెప్పడంతో భర్త గుట్టే అంకుశ్ కోపంతో ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని అత్తోరు ఇంటికి వచ్చి భార్య సంజీవనిపై కత్తితో దాడి చేశాడు. కూతురిపై జరుగుతున్న దాడిని అడ్డుకోవడానికి వచ్చిన తల్లి కేంద్రే అనిత, అమ్మమ్మ రాధాబాయిలపై కూడా దాడి చేయడంతో భార్య సంజీవనికి తీవ్రగాయాలు అయ్యాయి. అత్త అనిత, అమ్మమ్మ రాధాబాయిలకు స్వల్ప గాయాలు అయ్యాయి. స్థానికులు వెంటనే మండలకేంద్రంలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించి ప్రథమ చికిత్సలు అందించినట్లు తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం కోసం 108 అంబులెన్స్‌తో ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించినట్లు తెలిపారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ దుబ్బక సునీల్ తెలిపారు.

సమస్యల పరిష్కారానికే టోల్ ఫ్రీ నంబర్

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతికుమారి

ఎదులాపురం, ఫిబ్రవరి 18 : సమస్యల పరిష్కారానికే టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్నారు. మంగళవారం తాగునీరు, రేషన్ కార్డులు, విద్యుత్, రైతు భరోసా, ఇరిగేషన్, రబీ క్రాప్‌లకు సంబంధించిన అంశాలపై కలెక్టర్ రాజర్షి షా, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తాతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలలో ఎక్కడ కూడా తాగునీరు, సాగునీరు, విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా నిరంతరం పర్యవేక్షణ జరపాలని సూచించారు. తాగునీటి సరఫరాకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని, టోల్ ఫ్రీ నంబర్ 1800 599 4007 ద్వారా కూడా ప్రజలు తాగునీటి సమస్య గురించి ఫిర్యాదు చేయవచ్చని అన్నారు. రాష్ట్రంలో ఎక్కడైనా విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు ఉంటే టోల్ ఫ్రీ నంబర్ 1912కు ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడుతూ.. ఎక్కడెక్కడ సమస్యలు ఉన్నాయో ఫీల్డ్ వెరిఫికేషన్ చేసి నివేదిక సమర్పించాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారిని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్డీవో వినోద్ కుమార్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు

నిర్మల్ చైన్‌గేట్, ఫిబ్రవరి 18 : వేసవిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం హైదరాబాద్‌లోని సచివాలయం నుంచి ఆమె జిల్లా కలెక్టర్లతో తాగునీరు, విద్యుత్తు వినియోగం, రైతు భరోసా, ఆహారభద్రత కార్డుల పరిశీలన, రబీ సీజన్ సాగునీరు అంశాలపై వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. నిర్మల్‌లో కలెక్టర్ అభిలాష అభినవ్, అధికారులు పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్సులో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిశోర్‌కుమార్, ఇరిగేషన్ ఎస్ఈ రవీందర్, డీసీవో శ్రీనివాస్, వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, మిషన్ భగీరథ ఈఈ సందీప్, మున్సిపల్ కమిషనర్లు జగదీశ్వర్‌గౌడ్, జాదవ్‌కృష్ణ, డీఎస్వో కిరణ్‌కుమార్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కందుల కొనుగోళ్లు చేపట్టాలని అంతర్రాష్ట్ర రహదారిపై బైఠాయించిన రైతులు

కందులు కొనాలని రోడ్డెక్కిన రైతన్న

బేల, ఫిబ్రవరి 18 : ఆరుగాలం కష్టపడి పండించిన కంది పంటను కొనుగోలు చేయాలంటూ అన్నదాత రోడ్డెక్కాడు. ఆదిలాబాద్ జిల్లా బేల మండలంలో రైతు లు మంగళవారం అంతర్రాష్ట్ర రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. కంది కొనుగోళ్లకు గన్నీ బ్యాగులు లేవని ఒక అధికారి, కూలీల కొరత అని మరో అధికారి సాకులు చెబుతున్నారని రైతులు మండిపడ్డారు. విషయం తెలిసిన ఎస్ఐ దివ్య భారతి సిబ్బందితో వచ్చి సంబంధిత అధికారులతో మాట్లాడారు. సమస్య పరిష్కారం అయ్యేలా చూస్తామనడంతో రైతులు ప్రస్తుతానికి శాంతించి ధర్నా విరమించారు.